ప్రజల్లో సామాజిక చైతన్యం రావాలి



గుజ్జ కృష్ణకు పురస్కారం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, వకులాభరణం

గన్‌ఫౌండ్రీ: ప్రజల్లో సామాజిక చైతన్యం రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రవీంద్రభారతీలో మంజునాథ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి గ్లోబల్ ఐకాన్ అవార్డులను సోమవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సినీ నటులు పృథ్వీ, కిరణ్, క్రిష్, జగదీశ్వరీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ మామిడి భీంరెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మంజుల గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడికతీత చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: వర్షాకాలం సమీపిస్తుండడంతో నాలాలు, కచ్చామోరీల్లో పూడికతీత పనులు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. సోమవారం నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రాంతాల్లో ఇంకా డీ షిల్టింగ్ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు జాంబాగ్, తోప్‌ఖానా, గోషామహల్, ఉస్మాన్‌గంజ్ ప్రాంతాల్లో వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ఈ విషయమై 14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌కు వినతి పత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జాంబాగ్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు అహ్మద్, మహ్మద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం



కార్టూన్ మిత్ర పురస్కారాలు అందజేస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హాస్యానందం, సత్కాలభారతీ ఆధ్వర్యంలో రవీంద్రభారతీలో సోమవారం తెలుగు కార్టూనిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ...హాస్యం మన ఆయుష్షును పెంచుతుందన్నారు. 'నవ్వడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగం' అని పెద్దలు ఊరికే అనలేదని గుర్తుచేశారు. అనంతరం ప్రముఖ కార్టూనిస్టు కృష్ణ కిశోర్ కార్టూన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా హాస్యానందం నిర్వహించిన కార్టూన్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు పలువురికి కార్టూన్ మిత్ర పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సినీ నటుడు హర్షవర్ధన్, సాహిత్యకారులు సుధామ, సాంఘిక సేవకురాలు సత్యవాణి, బాపూరమణ అకాడమీ కార్యదర్శి సుబ్బరాజు, హాస్యానందం అధ్యక్షుడు రాము, కార్టూనిస్టు బ్నిం తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ ధర్మాదాయ ఉద్యోగులకు ఐఆర్ కల్పించాలి



ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ అయ్యర్‌కు వినతి పత్రం అందిస్తున్న అర్చక జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగులకు గత ప్రభుత్వం ప్రకటించిన ఐఆర్. (ఇంటర్ రిలీఫ్)ను కలపాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ అర్చక ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎండోమెంట్స్ అండ్ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ అయ్యర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు గంధం కర్ణాకర్ నాయుడు, సీహెచ్ బద్రినాథ చార్యులు, కాండూరి కృష్ణమాచార్యులు, పరశురాం రవీంద్రచార్యులు, చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ.. అర్చక ఉద్యోగ కుటుంబాలకు కారుణ్య నియామకం ద్వారా ప్రస్తుతం ఆలయాల ద్వారా జీతాలు అందజేస్తున్నారని, వారికి గ్రాంటీస్ ఏయిడ్ ద్వారా జీతాలు రావాల్సి ఉందన్నారు. ఆ ఫైల్‌కు ఫైనాన్స్ శాఖ క్లియరెన్స్ ఇచ్చినా ఎండోమెంట్స్‌లో మాత్రం పెండింగ్‌లో ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో తమకు జీతాలు ఇచ్చిన ప్రభుత్వానికి ఎలాంటి భారం పడదన్నారు. అలాగే కొంతకాలంగా సర్వీస్ ఇంక్రిమెంట్లు, సాంకేతిక పరమైన అంశాలు నిలిపేశారని పేర్కొన్నారు. దానికి ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

నాంచారమ్మ జాతరను పెద్ద ఎత్తున నిర్వహిస్తాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

గోల్కొండ: ఈ నెల 23న ప్రారంభం కానున్న నాంచారమ్మ మహా జాతరను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులతో కలిసి జాతర పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలో జరిగే జాతరకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే స్థానిక, జిల్లా అధికారులతో మాట్లాడనన్నారు. ఎరుకల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సీఎంను కోరుతానన్నారు. అంతేకాకుండా మరిన్ని గురుకులాలు ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రికి విన్నవిస్తానన్నారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు కురాకుల కృష్ణ, మల్లేశ్, రఘు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజేంద్రనగర్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, సురేష్, మిత్రల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, బుద్వేల్, కిస్మత్‌పూర్, అత్తాపూర్, హైదర్‌గూడ, ప్రేమావతిపేట్, బండ్లగూడ ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజేంద్రనగర్ 1987–88 బ్యాచ్‌కు చెందిన 40 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కిడ్వే కాటేజ్ రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అకాల మృతి చెందిన దివంగత రాకేష్ (సింగర్)కు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాత మిత్రులందరూ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తుల్జాగారి శ్రీరాములు, ధన్‌రాజ్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మురళీ, గోవింద్‌రాజ్, రాజేందర్, సురేశ్, శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



రాకేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

భక్తుల ఇలవేల్పు.. కార్వాన్ లక్ష్మీ నరసింహస్వామి..!

- 400 ఏళ్ల చరిత్ర గల మందిరం
- రేపు జయంత్యుత్సవాలు
- ఆలయ పరిసరాల్లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, పబ్లిక్ నల్లా
- తొలగించాలని భక్తుల విన్నపం



కొలువుదీరిన ఏక శిల లక్ష్మీ నరసింహ స్వామి




జయంతి వేడుకలకు ముస్తాబైన ఆలయం

జియాగూడ: చారిత్రక శాహుకారి కార్వాన్‌లోని ఏక శిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం భక్తుల ఇలవేల్పుగా పేరు గాంచింది. నల్గొండ జిల్లాలోని యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లలేని వృద్ధులు దర్శించుకునేందుకు వీలుగా ఏకశిల లక్ష్మీ నరసింహస్వామి 400 ఏళ్ల క్రితం మూసీ నది ఒడ్డున వెలిశాడు. నిత్యం పూజలు, భక్తులతో అలరారే ఈ ఆలయం క్రమేనా శిథిలావస్థకు చేరుకుంటుంది. మూసీనది ప్రవాహం ఆలయాన్ని ముంచెత్తకుండా అప్పట్లో భూమి నుంచి 30 ఫీట్ల ఎత్తులో ఏకశిలపై ఆలయాన్ని నిర్మించారు. శాహుకారి కార్వాన్ రవ్వలు, రత్నాలు వ్యాపారానికి కేంద్రంగా పేరుగాంచింది. ఈ ఆలయానికి భూమి స్థిర ఆస్తులు ఉండేవి. క్రమేనా పట్టించుకునేవారు లేకపోవడంతో ప్రస్తుతం కొద్దిపాటి స్థలం మాత్రమే మిగిలింది. స్వామివారి జయంతి వేడుకలు నాటి నుంచి నేటి వరకు వైభవంగా కొనసాగుతుండడంతో భక్తులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న ఆలయం..

400 ఏళ్ల చరిత్ర గల ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటుంది. ఆలయం డంగు సున్నం, కొండ రాళ్లతో నిర్మించినది కావడంతో డంగు సున్నం క్రమేనా పెచ్చులూడిపోతుంది. సుమారు 30 అడుగుల ఎత్తులో నిర్మించినది కావడంతో మెట్లు, గోడలు, శిలలు, బీటలు వారాయి. ఆలయ పునఃనిర్మాణం చేపట్టాలని, అభివృద్ధి చేయాలని ఆలయ ప్రతినిధులు పడాల అనంత్‌కృష్ణ, శ్యాంలింగ్, శ్రీకాంత్, మనికంఠ రావు, వినిత్, గోపీ, పవన్, సుందర్ టీటీడీకి ప్రతిపాదనలు పంపించారు. ఆలయం ఎత్తులో ఉండడంతో గర్భగుడి రూఫ్ కాస్త కూలిపోతుంది. భక్తులు అధికంగా వచ్చినప్పుడు దశలవారీగా స్వామివారి దర్శనానికి పంపిస్తున్నారు. అలాగే ఆలయం ఖాళీ స్థలంలో కల్యాణ మండపం నిర్మించాలని కోరుతున్నారు.



ఆలయ గోడకు ఆనుకుని ఉన్న ఇండస్ట్రియల్ ట్రాన్స్‌ఫార్మర్

రేపు జయంత్యుత్సవాలు ..

ఈ నెల 22వ తేదీన లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, భక్తులకు సర్వదర్శనం. సాయంత్రం శ్రీ శివ శంకర క్రాంతి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం, అలాగే రాత్రి స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్..

ఆలయ ప్రాంగణంలో ప్రమాదకరంగా ఉన్న ఇండస్ట్రియల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరేచోటుకు తరలించాలని బస్తీవాసులు కోరుతున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ప్రభుత్వ కుళాయి ఉందని, దీంతో తరచూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వస్తుందని, కుళాయిని కూడా తరలించాలని బస్తీవాసులు కోరుతున్నారు.

ఇగ్నోలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024వ సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ బి.రాజగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేషన్) కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బీఏ, బీకాం, బీఎస్సీలో చేరేందుకు పూర్తి ఫీజు రాయితీని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ www.ifnou.ac.in లేదా 9492451812, 040–23117550 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు పాతబస్తీలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్మినార్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ అక్బర్ భాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సంజీవినీ హిల్స్, నలందనగర్, సిరిమల్లెనగర్, ఏజీకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే హైదర్‌గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని నలందనగర్, లోటస్ స్కూల్, ప్లీజంట్ పార్క్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, జనప్రియ ఓహెచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ,లక్ష్మీ నగర్, ప్లీజంట్ పార్క్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నటుల విద్యుత్ శాఖ ఏడీఈ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సరోజిని దేవీ ఆస్పత్రి సబ్‌స్టేషన్ పరిధిలో..

శ్రీరాంనగర్ కాలనీ, మాసబ్‌ట్యాంక్, పోచమ్మబస్తీ, ఎంజీనగర్, చాచానగర్ బస్తీ, హుమయూన్ నగర్, జహార మసీద్, క్యాస్టిల్ హిల్స్, క్రిసెంట్ ఆస్పత్రి, ఎన్‌ఆర్‌ఐ కాలనీ, కేజీఎస్ ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.

గుడిమల్కాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గాంధీ విగ్రహం, జేబాబాగ్, ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్, మురాద్‌నగర్, ఇమ్లీ జాడు, మిలాన్ టాకీస్, మెహిదీపట్నం ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలు, చోటా మసీద్, సయ్యద్ అలాగుడ, ఆలపాటి నగర్, కాల్విన్ హోటల్, చిల్లా పిటి, పోస్టాఫీస్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న అబ్దుల్‌సత్తార్, మీర్‌ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: దేశంలో ఉర్దూ భాషాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ ల్యాంగ్వేజ్ (ఎన్‌సీపీయూఎల్) నామినేటెడ్ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ అబ్దుల్ సత్తార్ అన్నారు. పాతబస్తీ దారుషిఫాకు చెందిన బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలిచి మళ్లీ ప్రధానిగా నరేంద్ర మోదీ పీఠం అధిరోహిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

'సమాజ సేవకే జీవితం అంకితం'



రోహిణ్‌రెడ్డిని సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ తదితరులు

అబిడ్స్: సమాజ సేవకే తన జీవితం అంకితమని ఖైరతాబాద్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం ఆయనను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో విజి.పురుషోత్తం, శ్యాంసింగ్, శంకర్ సింగ్, శశిరాజ్ సింగ్, మహావీర్ సింగ్, కిషన్‌లాల్, బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేస్తేనే గుర్తింపు



మునావర్‌ను సన్మానిస్తున్న మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: కష్టపడి పని చేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. టోలిచౌకి అక్బర్‌బాగ్‌లోని టీఎస్‌సీవో కార్యాలయంలో సీనియర్ మజ్లిస్ నాయకుడు మునావర్‌ను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్‌నజీబ్ మాట్లాడుతూ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో మునావర్ చురుగ్గా పాల్గొంటూ సేవాభావాన్ని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ మజ్లిస్ నాయకులు ఖాలేద్‌అలీఖాన్, మహ్మద్ ఫహాద్, షేక్‌ఖాజా తదితరులు ఉన్నారు.

మురుగు.. పరుగు..!

- అసలే ఇరుకురోడ్డు.. ఆపై పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు
- ఉప్పుగూడలో అధ్వానంగా రహదారి
- ఇబ్బందులోవాహనదారులు.. పాదచారులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు



ఆలయ రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు

చార్మినార్: జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయ లోపం కారణంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల ప్రజలు పడరానీ పాట్లు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై డ్రైనేజీ మురుగునీరు రహదారిపై పొంగి ప్రవహిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉప్పుగూడలో ఈ పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఈ రోడ్డులోనే ప్రముఖ అమ్మవారి ఆలయం కూడా ఉంది. కాలినడకనే కాదు వాహనాల్లో కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు డ్రైనేజీ నీరు రోడ్డును ముంచెత్తితే.. మరోవైపు దుర్వాసన, చెత్త కుప్పలతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.

గుడికి వెళ్లేదెలా..?

పాతబస్తీలోని చారిత్రాత్మకమైన ఉప్పుగూడ మహంకాళి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు ఇది. రహదారిపైనే మురుగు ప్రవహిస్తుండడంతో భక్తులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిరోజు అమ్మవారికి తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో క్యూ కడతారు. ఉప్పుగూడ ఆర్‌యూబీ సాయి గ్రామర్ స్కూల్ నుంచి ఉప్పుగూడ జెండా ద్వారా ఉప్పుగూడ మహంకాళి దేవాలయం రోడ్డు అత్యంత అధ్వానంగా మారింది. నెలల తరబడి డ్రైనేజీ నీరు పొంగి ప్రవహిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి మురుగునీరు ప్రవహానికి అడ్డుకట్ట వేయాలని భక్తులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మించాలి..



ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన కచ్చా మోరీతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిని పునః నిర్మించాలని స్థానికులతో పాటు తాము ఆలయ కమిటీ తరఫున ఎన్నోసార్లు సంబంధిత జీహెచ్ ఎంసీ, జలమండలి అధికారులకు మొరపెట్టుకున్నాం. అయినా స్పందన లేదు. ఇప్పుడే పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంది. పరిస్థితి ఇలాగే ఉంటే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అధికారులు సత్వరమే స్పందించి సాధ్యమైనంత త్వరగా నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మించాలి.

– జనగామ మధుసూదన్ గౌడ్, ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్

'అల్వాల శ్యాంరావు అందరివాడు'



అల్వాల శ్యాంరావుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

లంగర్‌హౌస్: బీజేపీ ఎస్సీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు అల్వాల శ్యాంరావు అందరి వాడు అని మజ్లిస్ నాయకుడు, స్వతంత్ర కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి మాతంగి రమేశ్ అన్నారు. ఇటీవల శ్యాంరావు మృతి చెందగా రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్యాంరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు ఇంద్రసేనా రెడ్డి, వినేశ్ సింగ్ మాట్లాడుతూ.. ఫోన్లో వేధించి శ్యాంరావు మృతికి కారకులైన వారికి శిక్ష పడేవరకు ఊరుకోమన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు చంటిబాబు, రవీందర్ రెడ్డి, నరేందర్, నాగేంద్ర ప్రకాశ్‌రెడ్డి, వాజీ ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రోహిణ్‌రెడ్డికి సత్కారం



రోహిణ్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న ఎస్‌ఎస్‌కే ఆకాశ్

నాంపల్లి: ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డిని పలువురు నేతలు ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రగడ్డ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎస్‌కె ఆకాశ్ నేతృత్వంలో జి.వెంకట్, పీఎస్.శ్రీనివాస్, నాగరాజు కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి రోహిణ్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి



మెమోరాండం చూపిస్తున్న ముక్కా కృష్ణాగుప్తా తదితరులు

అబిడ్స్: రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణా గుప్తా డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు సోమవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన ప్రకారం.. రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. అలాగే వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే'

గోల్కొండ: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వమే వస్తుందని కార్వాన్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రజలను దోచుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని, అదే విధంగా ఆరు నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తుత్తి వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

నేడు రవీంద్రభారతిలో సీల్‌వెల్ సుస్వరాలు

గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతిలో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీల ఆధ్వర్యంలో ఈ నెల 21 (నేడు)సీల్‌వెల్ సినీ సుస్వరాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ గాయనీ ఆమని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటుడు మురళీ మోహన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, కోలేటి దామోదర్ గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పలువురికి ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, దాసరి పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

వినతిపత్రం అందజేత

రాజేంద్రనగర్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్‌లోని పత్తికుంటలో అభివృద్ధి పనులను చేపట్టాలని రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. ఈ మేరకు సోమవా రం చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని వర్షాలు కురిసే ముందు పత్తికుంటలో పూడికతీత పనులను చేపట్టి వినాయక నిమజ్జనానికి భారీ విగ్రహాలు నిమజ్జనం చేసేలా అవకాశం కల్పించాలన్నారు. ప్రతిఏటా మన ప్రాంతంలో ఉన్న విగ్రహాలే కాకుండా దూర ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలను ఇక్కడికి నిమజ్జనానికి తీసుకొస్తారన్నారు. వెంటనే పత్తికుంటను శుభ్రం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.